



# అటెండర్‌కు ఆత్మీయ వీడ్కోలు



**బల్ల లింగయ్య..**

**ఈ పేరు ఆ బడిలో అందరికీ సుపరిచితం. దాదాపు నాలుగు దశాబ్దాల అనుబంధం. ఎంతో మంది ఉపాధ్యాయులు పాఠాలు చెప్పారు, మరెంతో మంది విద్యార్థులు ఇక్కడ ఓనమాలు దిద్దారు. వచ్చిన వారు వెళ్లారు.. కొత్తవారు వచ్చారు. కానీ, ఈయన మాత్రం అందరికీ వారధిగా, ఓ మరుపురాని వ్యక్తిగా అందరి మదిలో నిలిచిపోయారు.**



- **ఉద్వేగానికి లోనైన విద్యార్థి లోకం**
- **ఉపాధ్యాయుల అనుబంధాల తోరణం**
- **ఊరంతా ఏకమై వచ్చిన క్షణం**
- **బల్ల లింగయ్య ఉద్యోగ విరమణ వేళ..**
- **పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల ఘన సన్మానం**

**శెనార్తి మీడియా, గన్నేరువరం :**

గన్నేరువరం మండలంలోని చీమలకుంటపల్లి గ్రామంలో ఉన్న బడిలో 1985 నుంచి 2025 వరకు 40 ఏళ్లు అటెండర్ వృత్తిలో నిబద్ధతగల ఉద్యోగిగా, క్రమశిక్షణతో పని చేశారు. సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో మచ్చలేని వ్యక్తిత్వంతో మెలిగిన ఆయన బుధవారం ఉద్యో విరమణ చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సన్మానించారు.

ఇన్నేళ్ల ఉద్యోగ జీవితంలో కాంట్రాక్ట్ ఉద్యోగిగానే ఉండిపోయారు ఆయన. నాడు రూ.75ల జీతంతో విధుల్లో చేరి.. నేడు రూ.15000లకు రిటైర్ అయ్యారు. ఉద్యోగ జీవితమంతా కాంట్రాక్టు ఉద్యోగిగానే ఉండి పోయారు. నాలుగుదశాబ్దాల ఉద్యోగ జీవితంలో ఎన్నో మధురానుభూతులను సొంతం చేసుకున్నారు. ఎంతోమంది విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఆత్మీయ అనుబంధాన్ని పంచుకున్నారు. ఊరు ఊరంతా ఆయన ఉద్యోగ విరమణ మహోత్సవానికి హాజరై, ఘనంగా వీడ్కోలు పలికింది అంటే ఆయన వ్యక్తిత్వం ఏంటో సులభంగా అర్థం చేసుకోవచ్చు. ఈ సందర్భంగా అందరూ కలిసి తలో చేయి వేసి రూ.41116 లను కానుకగా ఇవ్వడం విశేషం. ప్రభుత్వ పాఠశాలకు అటెండర్‌గా పని చేసినా, ఆయన ఓ సాధారణ కాంట్రాక్టుగా మిగిలిపోవడం బాధాకరమని ఊరిజనం వాపోయారు. ఆయనకు రిటైర్మెంట్ ప్రయోజనాలు ఏమీ లేకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఇక పున్నామ నరకం నుంచి కాపాడతారనుకున్న ఇద్దరు కుమారులు చిన్న వయస్సులోనే లింగయ్యకు దూరమవ్వడం ఆయన జీవితానికి పెద్ద వెలితి. కష్టమో, నష్టమో భార్యతో చెప్పుకుంటూ, నేను నీకు, నాకు నువ్వు అన్నట్టుగా ఇద్దరూ కాలం గడుపుతున్నారు.

భార్య లింగమ్మతో కలిపి ఆత్మీయ సత్కారం జరిపారు. ఈ వేడకకు ఎక్కడెక్కడి నుంచో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల తరలివచ్చారు. తమ అనుబంధాలను నెమరువేసుకున్నారు. పాఠశాలతో ఉన్న జ్ఞాపకాలను పంచుకున్నారు. అనంతరం రోజంతా ఆనందంగా గడిపారు. ఉద్యోగ, ఉపాధి రీత్యా ఎక్కడ ఉన్నా తమ మధ్య అనుబంధం ఇలాగే కొనసాగాలని పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.








**ఇప్పటి తరంలో కనిపించడం లేదు**

1985లో లింగయ్య అటెండర్‌గా చేరిన సమయంలో అందరితో ఎంతో అన్యోన్యంగా ఉండేవారు ఆ రోజుల్లో మనుషుల్లోని మానవీయత, సమాజపు పోకడలు ఇప్పటి తరంలో కనిపించడం లేదు. ఉద్యోగంలో చేరిన కొత్తలోనే లింగయ్య మంచి పనితీరును చూపించి అందరికీ దగ్గరయ్యాడు.

**రాజిరెడ్డి, ఉపాధ్యాయుడు**



**ఇప్పటి తరంలో కనిపించడం లేదు**

స్కూల్ లోనే విద్యార్థుల భవిష్యత్తుకు ప్రాథమిక స్థాయిలోనే గట్టి పునాది పడుతుంది. అందులో నేను కూడా భాగస్వామిని కావడం ఆనందంగా ఉంది. విద్యార్థుల లక్ష్యాలకు అనుగుణంగా తీర్చే సమయం కూడా బడిలోనే.

**చంద్ర శేఖర్, ఉపాధ్యాయుడు**



**విద్యార్థి జీవితం అత్యంత ముఖ్యమైనది**

ప్రతి ఒక్కరికి పాఠశాల విద్య ఎంతో ముఖ్యమైనది. విద్యార్థిగా ఎన్నో ప్రతి ఒక్కటి నేర్చుకుంటారు. పాఠశాలలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు బడితో ఎంతో అనుబంధం ఉంటుంది. తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు ఇచ్చే గౌరవ, మర్యాదలు ఎక్కడా దొరకవు.

**అనురాధ, టీచర్**



**ఇక్కడ పని చేయడం గొప్ప అనుభూతి**

ఒక దశలో ఈ పాఠశాల మూత పడే స్థాయికి చేరుకుంది. అప్పుడు ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను ఒప్పించి తిరిగి విద్యార్థులను ఈ బడిలో చేర్పించాం. మూతపడే స్కూలును మళ్లీ విద్యార్థులతో కళకళలాడేలా చేసినందుకు నాకెంతో సంతోషంగా ఉంది. ఇక్కడ పని చేయడం గొప్ప అనుభూతి

**తేజస్విని , టీచర్**



**చదువుల గోదాం కాదు..**

స్కూల్ అంటే కేవలం చదువుల గోదాం కాదు. బడి అంటే ప్రయోగ శాల . విద్యార్థులకు చదువుతో పాటు ఆనం దాన్ని పంచే అందాల వనం. బడి నుంచే ప్రతీ విద్యార్థి ప్రయాణం మొదలవు తుంది. ఇక్కడే ఎన్నో మధురాను భూతులు ఉంటాయి.

**అర్చన, టీచర్**



**లింగయ్య లాంటి వాళ్లు దొరకడం అరుదు**

ఒక ఉద్యోగ ప్రయాణంలో లింగయ్య లాంటి వాళ్లు దొరకడం ఈ రోజుల్లో చాలా అరుదు. ఉద్యోగం అంటే కేవలం తనకో ఉపాధి మార్గమనే భావన కాకుండా అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులతో పాటు తల్లిదండ్రు లతోనూ మంచి సంబంధాలు కలిగి ఉండేవాడు.

**పూర్ణచందర్, ఉపాధ్యాయుడు**

## అతిపెద్ద రాజకీయ పార్టీ బీజేపీనే

- బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు భాస్కరాచారి



**శెనార్తి మీడియా, గన్నేరువరం:** గన్నేరువరం: దేశసేవకు నేషన్ ఫస్ట్ మంత్రంతో అంకితమైన ఏకైక రాజకీయ పార్టీ భారతీయ జనతా పార్టీ అని జిల్లా ఉపాధ్యక్షుడు రంగు భాస్కరాచారి అన్నా రు. బుధవారం గన్నేరువరంలో మండల అధ్యక్షు డు తిప్పర్తి నికేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీజేపీ క్రియాశీలక సభ్యుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన భాస్కరాచారి, ప్రపంచవ్యాప్తంగా అత్యధిక సంఖ్యలో కార్యకర్తలు కలిగిన పార్టీగా బీజేపీ ఎదిగిందని పేర్కొన్నారు. 44 ఏళ్ల కఠిన శ్రమ, పోరాటం, త్యాగాలతో ఈ స్థాయికి పార్టీ చేరిందని, ఇందుకు ఎందరో మహానుభావుల సేవలు మరువలేనివని చెప్పారు. నేషన్ ఫస్ట్ అనే నినాదంతో దేశ ప్రజల ఆకాంక్షలు నెర వేర్చేందుకు నిరంతరం శ్రమించే కార్యకర్త లే పార్టీకి బలంగా నిలుస్తున్నారని అన్నారు. సమావేశం లో ఏలేటి చంద్రా రెడ్డి, విలాసాగరం రామచంద్రం, గుంటుక శంక ర్, అరికాంతం అనిల్ రెడ్డి, మచ్చ బాలరాజు, గాదె వెంకన్న, బండి తిరుపతి, అటికం రామచంద్రం, రాజిరెడ్డి, మళ్ళా రెడ్డి, లక్ష్మీ పతి, నర్సింహ స్వామి, వేణు, సాయి, గణేష్, జగన్ పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణ మనందరి బాధ్యత



**శెనార్తి మీడియా,తంగళ్ళపల్లి:** రాజ్యాంగ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రవీణ్ జె టోనీ అన్నారు. రామన్నపల్లె గ్రామంలో కాంగ్రెస్ నేత మందాటి తిరుపతి యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన రాజ్యాంగ పరిరక్షణ యాత్రలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించిన నాయకులు, గ్రామస్థులతో కలిసి రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కాంగ్రెస్ నేతలు, అంబేద్కర్ వారసత్వాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడటం కోసం దేశ వ్యాప్తంగా గ్రామాలు, పట్టణాల్లో ఐక్యత సాధించేందుకు ఈ యాత్ర చేపడుతున్నట్టు తెలిపారు. పార్ల మెంట్ సాక్షిగా బీజేపీ అంబేద్కర్‌ను, రాజ్యాంగాన్ని అవమా నించిందని విమర్శించారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదంతో ఆందోళనకు సిద్ధం కావాలన్నారు.సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి జోడెద్దుల బండిలా వేగంగా సాగుతున్నాయని పేర్కొన్నారు.

## జై బాపు జై భీమ్ – జై సంవిధాన్ యాత్ర




**శెనార్తి మీడియా, గన్నేరు వరం:** కాంగ్రెస్ పార్టీ గన్నేరువరం మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పారువెల్ల, ఖాసింపేట్, చాకలివానిపల్లి గ్రామాల్లో బుధవారం జై బాపు జై భీమ్ – జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర చేపట్టారు. జై బాపు.. జై భీమ్ అంటూ కాంగ్రెస్ కార్యకర్తలు నినదించారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నాయకులు పేర్కొన్నారు. పాదయాత్రలో మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు జెల్లా రాజేశ్వరి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎఎంసీ డైరెక్టర్లు, గ్రామ శాఖ అధ్యక్షులు, ఎస్సీ సెల్, బీసీ సెల్, మహిళా సెల్, యూత్ కాంగ్రెస్ ప్రతినిధులతో పాటు వివిధ ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రమోషన్ పొందిన కానిస్టేబుళ్లకు సన్మానం



**శెనార్తి మీడియా, గన్నేరువరం:** గన్నేరు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుళ్లుగా పనిచేసిన నగేష్, మిత్యలు హెడ్ కానిస్టేబుల్స్‌గా ఉద్యోగోన్నతి పొందారు. ఈ సందర్భంగా బుధవారం వారిని సన్మానించారు. ఉద్యోగోన్నతి పొందిన నగేష్, మిత్య భవిష్యత్తు బాధ్యతలు విజయవంతంగా నిర్వర్తించాలని ఎస్ఐ, తోటి సిబ్బంది ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా నగేష్ మెదక్ జిల్లాకు, మిత్య కామారెడ్డి జిల్లాకు ప్రమోషన్ పై బదిలీ అయ్యారు. కార్యక్రమంలో ఎస్ఐ నరేష్, ఏఎస్ఐ రాధాకిషన్, హెడ్ కానిస్టేబుల్ భాస్కర్ రెడ్డి సహా పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

# నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలి

- అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్

**శెనార్తి మీడియా, చెన్నూరు(మంచిర్యాల):**

రైతుల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో నిబంధనల మేరకు నాణ్యమైన వరి ధాన్యం మాత్రమే స్వీకరించాలన్నారు జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్. బుధవారం చెన్నూరు మండలంలోని షాదిఖానాలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, తహసీల్దార్ మల్లికార్జున్ తదితరులతో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కనీస మద్దతు ధరతో పాటు సన్నబియ్యం పండించిన రైతులకు క్వింటాల్‌కు ₹500 బోనస్ చెల్లించనున్నట్టు తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా నిబంధనలను ఖచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. కొనుగోలు చేసిన వెంటనే రైతులకు రసీదులు అందించాలనీ, కేంద్రాల్లో తాగునీరు, నీడ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు అవసరమైన మేరకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు



అనంతరం రైతుల వివరాలను ట్యాబ్‌లలో నమోదు చేసి 48 గంటలలోపు వారి ఖాతాలలో నగదు జమ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కల్లాలలో ధాన్యం మాత్రమే తీసుకురావాలనీ, తాలు, మట్టి గడ్డలు లేకుండా ఉండేలా రైతులకు ముందుగా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ శ్రీకళ, మార్కెటింగ్ డిపిఎం, చెన్నూరు, జైపూర్, భీమారం, మందమర్రి, కోటపల్లి మండలాల కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# పెద్దపులి సంచారమంటూ వదంతులు

**శెనార్తి మీడియా, బెల్లంపల్లి, (మంచిర్యాల):** ఇటీవల బెల్లంపల్లి పరిసర అటవీ ప్రాంతాల్లో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన పెద్దపులి మళ్లీ కాసిపేట మండల అడవుల్లో కనిపించిందనే వదం తులు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. దుబ్బగూడెం, బుగ్గ గూడెం, కొత్త వరిపేట, దేవాపూర్ వంటి గ్రామాల్లో ఈ వార్తలు విస్తరిస్తుండటంతో ప్రజలు మరోసారి భయాందోళనకు లోనవుతున్నా రు. ఇప్పటికే రెండు

### గ్రామాల్లో భయాందోళన

నెలల క్రితం బుగ్గ అటవీ ప్రాంతం నుండి కుష్ణ పల్లి ఫారెస్ట్ రేంజ్ వరకు పెద్దపులి సంచరించినట్టు గుర్తించగా, అప్పట్లో చిరుతలు పశువులపై దాడులు జరపడం ప్రజల్లో భయాన్ని మిగిల్చింది. తాజాగా గోండుగూడెం వద్ద రోడ్డు దాటుతున్న పెద్ద పులిని రైతులు చూశారన్న వదంతులు ఆందోళనకు దారితీస్తున్నాయి. ఈ నేపథ్యంలో ముత్యం పల్లి డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ నాయక్ స్పందిస్తూ, కాసిపేట పరిసరాల్లో పెద్దపులి అడుగుజాడలు కనిపించలేదన్నారు. ప్రస్తుతం పెద్దపులి లక్షెట్టిపేట ఫారెస్ట్ రేంజ్ పరిధిలో ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. వాస్తవాలపై నిఘా కొనసాగుతోందని, ఎక్కడైనా పెద్దపులి ఆనవాలు కనిపిస్తే అటవీ శాఖకు వెంటనే సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

## భూమి వివాదానికి తెర

- ప్రభుత్వానికి స్వాధీనమైన 30 గుంటల భూమి



**శెనార్తి మీడియా, బెల్లంపల్లి (మంచిర్యాల) :** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలోని ఆకనపల్లి గ్రామ శివారులో నెలకొన్న భూమి వివాదం బుధవారం పరిష్కారమైంది. సర్వే నంబరు 64లో ఉన్న వివాదాస్పద భూమిపై తహసిల్దార్ జ్యోత్స్న ఆదేశాలతో రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. కొలతలు తీసిన అనంతరం 30 గుంటల భూమి ప్రభుత్వానికి చెందినదిగా తేలినట్టు అధికారులు ప్రకటించారు. ఈ మేరకు భూమిని అధికారికంగా స్వాధీనం చేసుకున్నట్టు తహసిల్దార్ జ్యోత్స్న తెలిపారు. సంబంధిత భూభాగాన్ని సబ్‌స్టేషన్ నిర్మాణానికి కేటాయించనున్నట్టు అధికారులు వెల్లడించారు.

## రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



**శెనార్తి మీడియా, మందమర్రి(మంచిర్యాల):** రాజ్యాంగ పరిరక్షణ ప్రతి పౌరుని బాధ్యతగా గుర్తించాలని స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. బుధవారం క్యాతన్‌పల్లి పురపాలక ఐదవ వార్డు అమరవాది గ్రామంలో 'జై బాపు – జై భీమ్ – జై సంవిధాన్' కార్యక్రమాన్ని నిర్వహించి, రాజ్యాంగం పరిరక్షించాలన్న శపథం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో పాదయాత్ర ప్రారంభించిన ఆయన, ప్రజలతో మమేకమయ్యారు. కార్యక్రమంలో సమన్వయకర్త అంజన్ కుమార్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పల్లె రాజు, అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం



**శెనార్తి మీడియా, వేమనపల్లి(మంచిర్యాల) :** వేమనపల్లి మండలంలోని కల్లంపల్లి గ్రామంలో పైలట్ ప్రాజెక్టు కింద మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను బుధవారం మాజీ జెడ్పిటిసి రుద్రభట్ల సంతోష్ కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ సాబీర్ అలీ ముగ్గు పోసి ప్రారంభించారు. లబ్ధిదారులు పనులు ప్రారంభించిన వెంటనే దశలవారీగా ప్రభుత్వ మద్దతు అందుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమనపల్లి ఎంపీడీవో కుమారస్వామి, ఎంపీ ఓ శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ యువజన అధ్యక్షుడు ముల్కల సత్యనారాయణతో పాటు ముజ్జు, ఒడిలా రాజన్న, కొమరం రమేష్, కుమ్మరి శ్రీనివాస్, మధుసూదన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## "ఊరికి వెల్దాం -బస్తీకి పోదాం" విజయవంతం చేయాలి



**శెనార్తి మీడియా, బెల్లంపల్లి (మంచిర్యాల):** బిజెపి చేపట్టిన "ఊరికి వెల్దాం బస్తీకి పోదాం" కార్యక్రమాలను విజయవంతం చేయాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి పిలుపునిచ్చారు. బుధవారం తాండూర్ మండలంలో నిర్వహించిన బిజెపి ఆవిర్భావ వారోత్సవాల సందర్భంగా ఆయన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రతి గ్రామానికి వెళ్లి బిజెపి విధానాలు, ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఈ నెల 10, 11, 12 తేదీల్లో గ్రామ స్థాయిలో ఈ సమాచారాన్ని వ్యాపింపజేసేలా కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు పులగం తిరుపతి, మండల అధ్యక్షులు భరత్ కుమార్, సీనియర్ నాయకులు తుకారాం, మహీధర గౌడ్, సురేష్, మల్లేష్, పుట్ట కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రతిభా పరీక్షలను సద్వినియోగం చేసుకోండి

- టీఎస్ యుటిఎఫ్ నేతలు

**శెనార్తి మీడియా, బెల్లంపల్లి (మంచిర్యాల):** పీపుల్స్ ప్రోగ్రెసివ్ ట్రస్ట్ నిర్వహిస్తున్న ప్రతిభా పరీక్షను పేద కుటుంబాల విద్యార్థులు ఉపయోగించుకోవాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు గుండారపు చక్రపాణి, ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజా వేణు పిలుపునిచ్చారు. హైదరాబాద్ ప్రగతి నగర్‌లో ఐదో తరగతి నుంచి డిగ్రీ వరకు నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్యా బోధన అందిస్తున్న ఈ ట్రస్ట్ ఈ విద్యా సంవత్సరానికి 5,6,7 తరగతులలో కొత్తగా ప్రవేశాల కోసం ఎంపిక పరీక్ష నిర్వ హించనుంది. ప్రస్తుతం 4, 5, 6 తరగతులలో చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 18లోపు దరఖాస్తులు గూగుల్ ఫామ్ (forms. gle/uhxd 4dj8 0yxmudfm7) ద్వారా చేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9704634005 (చక్రపాణి), 9491345407 (రాజా వేణు) నంబర్లలో సంప్రదించాలన్నారు.

## టిడిపి నాయకుల వినతి

**శెనార్తి మీడియా, బెల్లంపల్లి (మంచిర్యాల):** తాండూర్ మండలంలోని కిష్టంపేట, తంగళ్ళపల్లి గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్లకు ఇరువైపులా మట్టి వేయాలని టిడిపి నాయకులు దాసరి శ్రీనివాస్ బుధవారం ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. పూర్తయిన సీసీ రోడ్లకు మట్టి వేయకపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని, ప్రమాదాల కారకంగా మారే పరిస్థితి ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రజలు అధికంగా నివసించే ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ఇప్పటికే పూర్తయిన రోడ్లకు వెంటనే ఇరువైపులా మట్టిని వేయాలని వినతిపత్రంలో కోరారు.



## కన్నాపూర్ లో సత్య హరిచంద్ర నాటక ప్రదర్శన

**శెనార్తి మీడియా శంకరపట్నం :** కన్నాపూర్లో తాటికొండ అయోధ్యరాములు తొలి వర్ధంతి సందర్భంగా, కుటుంబ సభ్యుల కోరిక మేరకు, గ్రామ పంచాయతీ ఆవరణలో పరకాల పాషా బృందం 'శ్రీ సత్య హరిశ్చంద్ర' నాటక ప్రదర్శన నిర్వహించారు. కన్నాపూర్, ధర్మారం గ్రామాల ప్రజలు, చుట్టుపక్కల గ్రామాల కళాకారులు ఈ కార్యక్రమానికి హాజరై, పాషా బృందం కళాకారులు ప్రదర్శనతో శ్రోతలను మంత్ర ముగ్ధులను చేశారు. మాజీ సర్పంచ్ తాటికొండ సదానందచారి మాట్లాడుతూ, తాను కూడా ఒక కళాకారుడిగా, తోటి కళాకారులను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో, కనుమరుగైపోతున్న నాటక, యక్షగాన, భాగవత కళలను ఆదరించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని తెలిపారు.



## రేషన్ షాపుల పరిశీలన



**శెనార్తి మీడియా, కాసిపేట (మంచిర్యాల) :** కాసిపేట మండలంలోని కాసిపేట, దేవాపూర్ గ్రామాల్లో రేషన్ షాపులను మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవి బుధవారం పరిశీలించారు. మండల బీజేపీ అధ్యక్షుడు సూరం సంపత్ కుమార్‌తో కలిసి ఆమె లబ్ధిదారులను కలిసి రేషన్ పంపిణీ సమయాలు, అందుతున్న నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దేవాపూర్ దళితవాడను సందర్శించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్న ఆమె, అనారోగ్యంతో ఉన్న మహిళా మోర్చా అధ్యక్షురాలు పెరుగు రాజును పరామర్శించారు. గ్రామంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీజేపీ విధానాలు, కార్యక్రమాలను కార్యకర్తలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రెడ్డి బాలరాజు, సీనియర్ నాయకులు దేవుని సంతోష్, మండల ఉపాధ్యక్షులు పెద్దపల్లి శంకర్, మహిళా మోర్చా అధ్యక్షురాలు బి. వనిత, ప్రధాన కార్యదర్శి చారులత, బీజేవైఎం నాయకులు చొప్పదండి విష్ణువర్ధన్, బీజేపీ కార్యకర్తలు ఆయిల సురేందర్, బైనేని మల్లేష్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## నియామకం



**శెనార్తి మీడియా, గన్నేరువరం :** కాంగ్రెస్ పార్టీ గునుకుల కొండాపూర్ గ్రామశాఖ అధ్యక్షుడిగా తాళ్లపల్లి రవికుమార్ ను నియమించినట్లు మండల అధ్యక్షుడు ముసుకు ఉపేందర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ జిల్లా అధ్య క్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు పేర్కొన్నారు.

## ఎమ్మార్పీఎస్ మున్సిపల్ కార్మిక సంఘ అధ్యక్షుడిగా రాసకొండ శ్రీనివాస్



**శెనార్తి మీడియా, బెల్లంపల్లి (మంచిర్యాల):** బెల్లంపల్లి మున్సిపల్ కార్మిక సంఘ నూతన అధ్యక్షునిగా రాసకొండ శ్రీనివాస్ మాదిగ బుధవారం ఎన్నికయ్యారు. పట్టణ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు రామగిరి మహేష్ నేతృత్వంలో కొత్త కమిటీని ప్రకటించారు. ఈ కమిటీలో రమేష్, రాజేశ్వరి ఉపాధ్యక్షులుగా, తోటపల్లి ప్రతాప్ అధికార ప్రతినిధిగా, బాలరాజు ప్రధాన కార్యదర్శిగా, మధునయ్య, శేఖర్ లు కార్యదర్శులుగా, రాములు కోశాధికారిగా బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మండల ఇన్‌చార్జి జిలకర శంకర మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు చిన్నరాజం, మచ్చ రాజేష్, నాతర శివ, రత్నం ఐలయ్య తదితరులు హాజరయ్యారు.